ఎమ్మెల్యే పరామర్శ



వేణును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మే 27: చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డుకు చెందిన యువజన నాయకుడు గందే వేణు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా వేణు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, మాజీ ఉప సర్పంచ్ రాము తదితరులున్నారు.

మహమూద్ అలీని పరామర్శించిన జుబేర్‌పాషా

మహమూద్ అలీని పరామర్శిస్తున్న జుబేర్‌పాషా

ములుగు, మే 27: మాజీ హోంమంత్రి మహమూద్ అలీని బీఆర్ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా మంగళవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న మహమూద్ అలీని జుబేర్ పాషా కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తులం బంగారం హామీకి కాంగ్రెస్ తూట్లు

- కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దే
- కూటిగల్, కొండాపూర్ చెరువులను నింపేందుకు కృషి
- మద్దూరు మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మద్దూరులో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), మే 27: అధికారంలోకి రాగానే కల్యాణలక్ష్మికి తోడుగా ఆడబిడ్డల పెండ్లిలకు తులం బంగారమిస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ తులం బంగారం హామీకి తూట్లు పొడిచిందని నగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా 21మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి, ఆడబిడ్డల పెండ్లిలకు అండగా నిలిచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, దీనికితోడు తులం బంగారం కూడా ఇస్తే బాగుంటుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 12లక్షల మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందించినట్లు గుర్తుచేశారు. సాయుధ పోరాటంతో పాటు చారిత్రాత్మక నేపథ్యమున్న మద్దూరు ప్రాంతాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఉమ్మడి మద్దూరు మండలంలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని ఇటీవల రాష్ట్ర మంత్రి సీతక్కను కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. గండిరామారం రిజర్వాయర్ నుంచి తరిగొప్పుల మీదుగా కూటిగల్, కొండాపూర్ చెరువులను గోదావరి జలాలతో నింపనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా జనగామ నియోజకవర్గ ప్రజలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందేవిధంగా కృషి చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలకు పార్టీలకతీతంగా తమ నీలిమా హాస్పిటల్ ద్వారా ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా ప్రభుత్వంతో పోరాడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏజీ రహీం, ఎంపీడీవో రామ్మోహన్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, బీఆర్ఎస్ మద్దూరు, ధూళిమిట్ట మండల అధ్యక్షులు మేక సంతోశ్‌కుమార్, మంద యాదగిరి, మాజీ వైస్ఎంపీపీ సుమలతామల్లేశం, మాజీ సర్పంచ్‌లు వంగ భాస్కర్‌రెడ్డి, ఊట్ల రవీందర్‌రెడ్డి, జీడికంటి సుదర్శన్, అందె భూపతి, చొప్పరి వరలక్ష్మిసాగర్, సుందరగిరి ప్రవంతిపురుశరాములుగౌడ్, బొల్లు కృష్ణవేణిచంద్రమౌళి, దోమ బాలమణిబాలకృష్ణ, గంగి భాగ్యలక్ష్మిశ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు నందనబోయిన నర్సింహులు, బొప్పె కనకమ్మనాగయ్య, బీఆర్ఎస్ నాయకులు దామెర మల్లేశం, ఇమ్మడి సంజీవరెడ్డి, కనకరాజు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న భక్తజనం

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

హుస్నాబాద్‌టౌన్, మే 27: హుస్నాబాద్ పట్టణంలోని శ్రీరేణుక ఎల్లమ్మను దర్శించుకునేందుకుగాను భక్తజనం మంగళవారం బారులు తీరారు. ఉదయం నుంచే భక్తజనం అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో వేచిచూశారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

సీసీ పనులను పూర్తిచేయండి

హుస్నాబాద్‌టౌన్, మే 27: హుస్నాబాద్ పట్టణంలో శంకుస్థాపనలు చేసిన సీసీరోడ్లు ఎందుకు పూర్తిచేయడం లేదని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పలు రహదారులు అధ్వాన్నంగా మారినప్పటికీ పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. నెలలు గడుస్తున్నా సీసీ రోడ్ల పనులను పూర్తిచేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. పనులను సత్వరమే పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జీలుగ విత్తనాల పంపిణీ

మద్దూరులో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏవో రామకృష్ణ

మద్దూరు(ధూళిమిట్ట), మే 27: మద్దూరు మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం వద్ద మండల వ్యవసాయ శాఖ అధికారి బూరెల రామకృష్ణ చేతుల మీదుగా మంగళవారం రైతులకు జీలుగ విత్తనాలను అందజేశారు. ఏవో మాట్లాడుతూ రైతులు పంటలు సాగు చేసే ముందు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగను సాగు చేస్తే భూసారం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం 50శాతం రాయితీతో జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, ఆగ్రోస్ నిర్వాహకుడు బోయిని మనోహర్, రైతులు పాల్గొన్నారు.

టీజేఎఫ్ గోడపత్రిక ఆవిష్కరణ

గజ్వేల్‌లో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న టీజేఎఫ్ సభ్యులు

గజ్వేల్, మే 27: తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవ సంబురాల గోడపత్రికను గజ్వేల్‌లో మంగళవారం ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో టీజేఎఫ్ అత్యంత కీలకపాత్ర పోషించిన టీజేఎఫ్ రజతోత్సవాలను జరుపుకోవడం సంతోషంగా ఉందని టీజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు నవీన్ అన్నారు. ఈనెల 31న జలవిహార్‌లో నిర్వహిస్తున్న రజతోత్సవాలకు జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు మహిపాల్‌రెడ్డి, కరుణాకర్, కృష్ణ, మల్లేశం, శంకర్, యాదగిరి, కరుణాకర్, ప్రభాకర్, నరేశ్, స్వామి, భాను పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించండి

నంగునూరు, మే 27: సికింద్రాబాద్ నుంచి నంగునూరు మండల కేంద్రం మీదుగా ఖాతా-ధూల్‌మిట్ట-లింగాపూర్ వరకు నడిచే ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కేసీఆర్ బస్సు అని పేరు ప్రఖ్యాతులు గాంచిన ఈ ఎక్స్‌ప్రెస్ బస్సు రద్దు కావడంతో ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ప్రస్తుతం సిద్దిపేటకు వెళ్లి హైదరాబాద్‌కు బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. నంగునూరు మండల కేంద్రం గుండా పలు గ్రామాలకు నైట్ అవుట్ ఎక్స్‌ప్రెస్ బస్సు రద్దుచేసి ఆర్డినరీ బస్సును నడిపిస్తున్నారని తెలిపారు. గతంలో ఎక్కువగా నడిచే బస్సులను సిద్దిపేట ఆర్టీసీ అధికారులే రద్దు చేశారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి రద్దు చేసిన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్యాంపు ఆఫీసుపై దాడి సిగ్గుచేటు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

జగదేవపూర్, మే 27: సిరిసిల్లలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు ఆఫీసుపై దాడి అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడి సిగ్గుచేటని బీఆర్ఎస్ మండల నాయకులు దాచారం కనకయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తుందన్నారు. సిరిసిల్లలో కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను అరెస్టు చేయకుండా అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు లాఠీలు ఝుళిపించడం ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల యువజన ప్రధాన కార్యదర్శి భాస్కర్, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు బాల కృష్ణ, ఉపాధ్యక్షులు శ్రీను, మండల ప్రచార కార్యదర్శి భాస్కర్, యువ నాయకులు అబ్బుబాయి, గౌస్ పాల్గొన్నారు.

సన్మాన సభకు తరలిరావాలి

బెజ్జంకి, మే 27: ఈనెల 31న వరంగల్‌లో నిర్వహించే మందకృష్ణ మాదిక ఆత్మీయ అభినందన సన్మాన సభకు తరలిరావాలని ఎమ్మార్పీస్ మండల శాఖ అధ్యక్షుడు వడ్లూరి పరశురాములు కోరారు. మంగళవారం మండల కేంద్రమైన బెజ్జంకిలో సభా ఏర్పాట్లపై మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు, అభిమానులు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు భూమయ్య, చంద్రయ్య, శంకర్, బాబు, నర్సయ్య, మల్లేశం, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై రైతులకు అవగాహన

వర్గల్, మే 27: రైతులు పండించిన పంటలకు గతంలో మాదిరిగా సరియైన గిట్టుబాటు ధరలు కల్పించాలని సింగాయిపల్లి గ్రామ రైతులు వ్యవసాయశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం 'రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రీయ ఎరువుల వాడకం, రసాయన ఎరువుల వల్ల కలిగే దుష్పరిణామాలు, పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయకుమారి, శివాణి, వర్గల్ ఏవో శేషశయన, ఏఈవో సంతోష్ కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పొన్నాలలో...

సిద్దిపేట అర్బన్, మే 27: మండల పరిధిలోని పొన్నాలలో మంగళవారం తోర్నాల వ్యవసాయ పరిశోధనా స్థానం, జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు వానకాలం సాగుకు రైతుల సమాయత్తం, మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి టి.రాధిక, శాస్త్రవేత్తలు రమాదేవి, సతీష్, ఏడీఏ పద్మ, మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన

హుస్నాబాద్‌రూరల్, మే 27: సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ పోలీసులు కోరారు. మంగళవారం మండలంలోని నాగారం గ్రామ శివారులో ఉపాధి హామీ పనులు చేపడుతున్న కూలీలకు మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై, సైబర్ నేరాల పట్ల పోలీసులు అవగాహన కల్పించారు. స్కూల్‌కు వెళ్లే విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడూ గమనిస్తూ ఉండాలన్నారు. బ్యాంకు అధికారులమంటూ ఎవరైనా కాల్ చేసి మీ ఖాతా వివరాలు అడిగితే ఇవ్వకూడదన్నారు. ఏఎస్ఐ మణెమ్మ, హెడ్ కానిస్టేబుల్ శంకర్, షీటీమ్ బృందం సదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు

నిరుపేదకు ఆర్థిక సాయం

సిద్దిపేట టౌన్, మే 27: గూడు లేని నిరుపేద ఆర్యవైశ్యుడికి తామున్నామని ముందుకు వచ్చి ఇంటి స్థలం కోసం ఆర్థిక సహకారం అందించి సిద్దిపేట ఆర్యవైశ్య మహాసభ ఆదర్శంగా నిలిచింది. కోహెడ మండలం శనిగరంకు చెందిన లక్ష్మీనర్సయ్య ఆర్థిక స్థోమత లేక కిరాయి ఇంట్లో నివసిస్తూ అన్నిరకాలుగా ఇబ్బందులను పడుతున్నాడు. అతడి స్థితిని చూసి ఇంటి స్థలం కోనుగోలు కోసం ఆర్యవైశ్య మహాసభ రూ.61వేలను మంగళవారం అందజేసింది. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు రత్నాకర్, అధ్యక్షుడు ఆంజనేయులు, కోశాధికారి మంకాల నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మేం చెప్పిన పేర్లు రాకుంటే ఎట్లు..

- మరి ఇందిరమ్మ కమిటీలో మేమెందుకు?
- మున్సిపల్ కమిషనర్‌పై మండిపడ్డ ఇందిరమ్మ కమిటీ సభ్యులు

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌ను ప్రశ్నిస్తున్న గడిపె సింగరి

హుస్నాబాద్‌టౌన్, మే 27: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో తాము చెప్పిన పేర్లు రాకుంటే తాము సభ్యులుగా ఉండి ఎందుకని ఇందిరమ్మ కమిటీ సభ్యులు హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌తో వాగ్వాదానికి దిగారు. తమ వార్డులో నిరుపేదలకు అన్యాయం జరిగిందంటూ తాము సంతకాలు పెట్టిన పేర్లు తొలిగించి మీకు ఇష్టమున్నవారి పేర్లు ఎందుకు రాశారంటూ పట్టణంలోని 1వ వార్డులోని కేబీకాలనీకి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గడిపె సింగరి మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌పై మండిపడ్డారు. తాము పేర్లు చెప్పినంక కూడా ఎందుకు తీసేశారని, తమకు తెలియకుండా ఇళ్లు మంజూరయ్యాయంటూ లబ్ధిదారుల నుంచి ఆధార్ కార్డులు తీసుకోవడం ఏమిటని సింగరి, బోనగిరి రజిత, సావుల మధు ప్రశ్నించారు. తమకు తెలియకుండా పేర్లు పంపితే ఊరుకోబోమని, మున్సిపల్ కమిషనర్‌గా ఆ అధికారం లేదన్నారు. తాము చెప్పిన లిస్టే రావాలని, తాము ఫైనల్ చేశాక ఇద్దరి పేర్లు తీసివేయాలని ఎవరు చెప్పారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అన్నిరకాలుగా లబ్ధిపొందిన వారికే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారని, ఇది పేదలకు అన్యాయం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడుతూ అన్నిరకాలుగా విచారణ చేసిన తరువాతే అర్హులైనవారి జాబితాను పంపామని, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన జాబితాలో అనర్హులు ఉంటే తొలిగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అయినప్పటికీ మరో మారు విచారణ చేస్తామని వారికి హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలు

సిద్దిపేట, మే 27: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈనెల 28 నుంచి జూన్ 12వ రకు సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. బండ్ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసివేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు శ్రమిస్తున్న పోలీసులకు అన్నివర్గాల ప్రజలు సహకారం అందించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో డీజే సౌండ్ వినియోగంపై నిషేధం విధించామన్నారు. మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అయితే సంబంధిత ఏసీపీ అనుమతి పొందాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి డీజే వినియోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నెల రోజులైనా ధాన్యం డబ్బులు పడలే..

- ఇదేంటని అడిగితే తరుగు తీయాలంటున్నరు
- బస్తాకు కిలో తీస్తేనే డబ్బులు జమ చేస్తామంటున్న నిర్వాహకులు
- తహసీల్దార్ సరితకు ఫిర్యాదు చేసిన 50 మంది రైతులు
- సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన తహసీల్దార్

తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నంగునూరు, మే 27: ధాన్యం సేకరించిన రెండు రోజుల్లో డబ్బులు చెల్లిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా.. అది క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. ఏకంగా నెల రోజులు దాటినా కొంత మంది రైతులకు డబ్బులు రాలేదు. ఇదేమని అడిగితే.. మీరు పంపిన బస్తాల్లో బరువు తక్కువగా ఉంది.. కాబట్టి మీరు ఒక బస్తాకు కిలో చొప్పున కోత విధించడానికి అనుమతి ఇస్తేనే ధాన్యం డబ్బులు ఇస్తామని కో ఆపరేటివ్ సొసైటీ, రైస్ మిల్లు నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో రైతులు ఒక్కసారిగా కంగు తిన్నారు. వివరాలిలా ఉన్నాయి. నంగునూరు మండలం సిద్దన్నపేట మార్కెట్ యార్డులో సుమారు 50 మంది రైతుల నుంచి నెల రోజుల క్రితం నంగునూరు కోఆపరేటివ్ సొసైటీ వారు ధాన్యం కొనుగోలు చేసి సిద్దిపేట అర్బన్ మండలంలోని మందపల్లి వద్ద గల శివసాయి రైస్‌మిల్లుకు తరలించారు. సుమారు 50 మంది రైతుల నుంచి 12 లారీల బస్తాలు కొనుగోలు చేసి రైస్‌మిల్లుకు పంపించారు. నిర్వాహకులు అన్ని దరఖాస్తులు తీసుకొని, ఓటీపీ కూడా చెప్పిన తర్వాత.. నెల రోజులైనా డబ్బులు రాకపోవడంతో సొసైటీ వారిని ప్రశ్నించారు. తమకు 12 లారీలకు కలిపి మొత్తం 50 క్వింటాళ్ల తరుగు వచ్చిందని, ఒక్కో లారీ రైతులందరూ ఒక బస్తాకు కిలో కోత విధించడానికి ఒప్పుకుంటేనే మళ్లీ ఓటీపీ చెప్పి.. డబ్బులు జమ చేస్తామని తెలిపారు. ఒక్కో లారీలో ఉన్న రైతులందరూ దీనికి ఒప్పుకొని సంతకం చేయాలని వారికి రైతుల పేర్లతో నిర్వాహకులు జాబితాలు కూడా ఇచ్చారు. ఇదెక్కడి అన్యాయమని మంగళవారం 50 మంది రైతులు లబోదిబోమంటూ తహసీల్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ సరితకు విన్నవించారు.

రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలి

హుస్నాబాద్‌టౌన్, మే 27: ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పని సరిగా రసీదులు ఇవ్వాలని హుస్నాబాద్ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం హుస్నాబాద్‌లోని రైతు వేదికలో డివిజన్ స్థాయి ఎరువులు, విత్తనాల డీలర్ల సమావేశాన్ని నిర్వహించారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఏడీఏ సూచించారు. సమావేశంలో ఏవోలు శ్రేయ, సతీశ్, సంతోష్, తస్లీమా సుల్తానా, ఏఈవో విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకం

బెజ్జంకి, మే 27: ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకమని ఏవో సంతోష్, ఉద్యానశాఖ అధికారి బాలాజీ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బెజ్జంకిలో రైతు వేదికలో రైతులకు ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభించి పంట ఆయిల్ పామ్ పంట అని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అఫీసర్ రాములు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

పోలీసులతో మాట్లాడుతున్న ఏసీపీ నర్సింహులు

గజ్వేల్, మే 27: విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ నర్సింహులు పోలీసు సిబ్బందికి సూచించారు. మంగళవారం నాడాయన గజ్వేల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. న్యాయం కోరుతూ వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి సమస్యను పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ప్రతి కేసులో పారదర్శకంగా పరిశోధన జరగాలన్నారు. ఆయన వెంట సీఐలు సైదా, ముత్యంరాజు, ఎస్ఐ యాదవ రెడ్డిలు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

మాట్లాడుతున్న ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, మే 27: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం నాగపురి కనకయ్య అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిరుపేదలకు ఇస్తామన్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను రాజకీయాలకతీతంగా అందించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికార కాంగ్రెస్ తమ కార్యకర్తల పేర్లనే ఎంపిక చేశారన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా దాటవేత ధోరణితో కాంగ్రెస్ పాలన కొనసాగిస్తున్నదని ఆరోపించారు. నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, బండకింది అరుణ్‌కుమార్, గొర్రె శ్రీనివాస్, ఎండీ కరీం, శ్రీకాంత్, సూర్న తిరుపతి, సంపత్ పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేయాలి

కొమురవెల్లి, మే 27: మండలంలోని మర్రిముచ్చాలలో ఎలక్ట్రానిక్ తూకం వల్ల 225 బస్తాల దోపిడి జరిగినట్లు తేలిందని, నష్టపోయిన బాధిత రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం కొమురవెల్లిలో ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో జరిగే దోపిడీని పట్టించుకోకుండా రైస్‌మిల్లర్లతో కుమ్మక్కైన అధికారి మహిళా గ్రూపులను బద్నాం చేసేందుకు కుట్ర పన్నాడన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి రైతులు నష్టపోయిన ధాన్యం డబ్బులను రికవరీ చేసి రైతుల ఖాతాల్లో జమచేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తేలు ఇస్తారి, జిల్లా కమిటీ సభ్యులు అత్తిని శారద, నాయకులు తాడూరి భరత్, నీల భిక్షపతి, యాదయ్య, కృపాకర్, దయానంద్, రవి, శ్రవణాచారి, అంజయ్య పాల్గొన్నారు.

షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అందించాలి

చేర్యాల, మే 27: ప్రభుత్వం పేదలకు అందించే సంక్షేమ పథకాలను ఎలాంటి షరతులు లేకుండా అందించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ కోరారు. మంగళవారం మండలంలోని గుర్జకుంటలో సీపీఎం గ్రామశాఖ 2వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పేదలకు మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసం పథకాలకు సిబిల్‌స్కోర్, నాలుగు చక్రాల వాహనాలు తదితర నిబంధనలు తొలగించాలన్నారు. గ్రామ కార్యదర్శిగా నంగి కనకయ్య, సహాయ కార్యదర్శులుగా బస్వరాజు నర్సయ్య, నంగి సత్తయ్య, కోశాధికారిగా బొమ్మ అయిలయ్య, సోషల్ మీడియా అధ్యక్షునిగా శనిగరం శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా నంగి అనిల్‌ను నియమించారు. కార్యక్రమంలో నాయకులు ఈరి భూమయ్య, జంగిలి యాదగిరి పాల్గొన్నారు.

పద్మశాలీల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలి

సిద్దిపేట టౌన్, మే 27: పద్మశాలీల అభివృద్ధే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తూరి సతీష్ పిలుపునిచ్చారు. సిద్దిపేట పట్టణ పద్మశాలి సమాజం నూతనంగా ఎన్నికైన కార్యవర్గం మంగళవారం ఆయనను కలిసింది. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సహకారంతో సిద్దిపేట చేనేత కార్మికులకు, పద్మశాలీలకు ప్రభుత్వపరంగా రావాల్సిన అన్ని పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రచార కార్యదర్శి ముదిగొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జోగు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

కొమురవెల్లి: పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

హుస్నాబాద్ టౌన్: పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

కొమురవెల్లి, మే